# సాక్షి మెదక్

బుధవారం । 13 । మార్చి । 2024






**వేసవి దుక్కులు..**

వేసవి కాలం ప్రారంభమైంది. ఈ సమయంలో ఖాళీ పొలాలను దున్నుకుంటే రైతులకు ఎంతో మేలు కలుగుతుంది.

వివరాలు 8లో ▸



**గ్రామాల అభివృద్ధికి కృషి**

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు.

వివరాలు 9లో ▸

**రంజాన్ వేళలు**

| ఇఫ్తార్ : | సహర్ : |
|---|---|
| బుధవారం (సాయంత్రం) 6:31 | గురువారం (ఉదయం) 5:04 |

## న్యూస్‌రీల్

### అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో స్టాల్ ప్రారంభం



అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో స్టాల్ ప్రారంభోత్సవంలో అధికారులు

**రామాయంపేట(మెదక్):** భారతీయ రైల్వే ఆధునీకరణలో భాగంగా మంగళవారం మండలంలోని అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో వన్‌స్టేషన్, వన్ ప్రొడక్ట్ స్టాల్ ప్రారంభమైంది.దీన్ని ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఆశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, గ్రామస్తులు ప్రత్యక్షంగా వీక్షించడానికి వీలుగా పెద్ద ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ డివిజన్ ఇంజినీర్ శ్రీతేజ, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ స్టాల్‌లో తెలంగాణ పిండి వంటకాలతోపాటు ఇతర ప్రాచుర్యం పొందిన ఆహార, తిను బండారాలను సైతం అందుబాటులో ఉంచుతామని అధికారులు పేర్కొన్నారు.

### నర్సింగ్ హోమ్ సీజ్



నర్సింగ్‌హోమ్‌ను సీజ్ చేసిన అధికారులు

**కౌడిపల్లి(నర్సాపూర్):** అనుమతి లేకుండా నిర్వహిస్తున్న నర్సింగ్ హోమ్‌ను సీజ్ చేసినట్లు మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి తెలిపారు. కౌడిపల్లి లో ఎలాంటి అనుమతి లేకుండా పేరు లేని నర్సింగ్ హోమ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు వచ్చిందన్నారు. దీంతో అధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేయగా వాస్తవమని తేలడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా వాటిని నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట జిల్లా మలేరియా అధికారి విజయేందర్, మండల వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, స్థానిక ఎస్ఐ రంజిత్‌రెడ్డి, వైద్యసిబ్బంది కృష్ణవేణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### 271 మంది గైర్హాజరు

**మెదక్ కలెక్టరేట్:** జిల్లాలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలకు మంగళవారం 95 శాతం విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ తెలిపారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర భౌతిక శాస్త్రం–2, అర్థ శాస్త్రం–2 పరీక్షలు జరుగగా 6,054 విద్యార్థులకు గానూ 5,781 మంది హాజరయ్యారని, మరో 271 మంది గైర్హాజరు అయ్యారని పేర్కొన్నారు. జిల్లాలోని ఆయా పరీక్షా కేంద్రాలను ప్రత్యేక అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించాయి.

### మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఐసీడీఎస్ సీడీపీఓ హేమభార్గవి



రన్నింగ్ పోటీల్లో టీచర్లు

**కౌడిపల్లి(నర్సాపూర్):** మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేమభార్గవి తెలిపారు. మంగళవారం కౌడిపల్లిలోని గిరిజన బాలికల మినీ గురుకులంలో మహిళా టీచర్లకు మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నారీశక్తి ఫిట్నెస్ రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా శక్తి గొప్పదన్నారు. వారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడల్లో పాల్గొనాలని చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటలాడాలన్నారు. క్రీడలలో గెలుపోటములు ఉంటాయని దీంతో జీవితంలో మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా రన్నింగ్ పోటీల్లో గెలుపొందిన టీచర్లకు బహుమతులు పంపిణీ చేశారు. శశికళ, లక్ష్మి, జమునరాణి పాల్గొన్నారు.

# వీడని ఉత్కంఠ..!

**మెదక్ లోక్‌సభకు అభ్యర్థులను ప్రకటించని ప్రధాన పార్టీలు**

- దీటైన వారి కోసం కసరత్తు
- టికెట్ల కోసం ఆశావహుల తీవ్ర ప్రయత్నాలు
- ప్రతిష్టాత్మకంగా సార్వత్రిక ఎన్నికలు



**సాక్షిప్రతినిధి, సంగారెడ్డి :** బీఆర్‌ఎస్ అగ్రనేతలు.. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ ప్రాతినిథ్యం వహిస్తున్న అసెంబ్లీ స్థానాలున్న మెదక్ పార్లమెంట్ నుంచి పోటీ చేయనున్న ప్రధాన పార్టీల అభ్యర్థులెవరు..? ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు భిన్నమైన ఫలితాలు వచ్చిన అసెంబ్లీ స్థానాలున్న ఈ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగనున్నది ఎవరు..? ఈ అంశంపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయనున్న అభ్యర్థులెవరేదానిపై స్పష్టత వస్తున్నప్పటికీ .. మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయనున్న అభ్యర్థుల ప్రకటన విషయంలో ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీలతో పాటు, బీఆర్‌ఎస్ కూడా ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థిని ఎదుర్కొనే దీటైన వారిని బరిలోకి దింపాలని యోచిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఈ సార్వత్రిక ఎన్నికలను కూడా ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. నువ్వా.. నేనా..? అనే రీతిలో తలపడనున్నాయి.

**ఏడింట ఆరుచోట్ల బీఆర్‌ఎస్..**

మెదక్ పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలున్నాయి. ఒక్క మెదక్ అసెంబ్లీ స్థానం నుంచి మాత్రమే అధికార కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా, మిగిలిన ఆరు అసెంబ్లీ స్థానాలను గులాబీ పార్టీ కైవసం చేసుకున్న విషయం విదితమే. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మాత్రం పట్టు నిలుపుకుంది. తన పట్టు నిలుపుకున్న స్థానాలున్న ఈ పార్లమెంట్ నియోజకవర్గాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు గులాబీ పార్టీ ఆచితూచి వ్యవహరిస్తోంది. బలమైన అభ్యర్థిని బరిలోకి దింపాలని యోచిస్తోంది. గులాబీ పార్టీ కంచుకోటగా ఉన్న ఈ మెదక్ పార్లమెంట్ స్థానంలో పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. జహీరాబాద్‌కు అభ్యర్థులను ప్రకటించినప్పటికీ.. మెదక్ మాత్రం ఇంకా ప్రకటించకుండా ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారాన్ని సాధించి ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇక్కడ బీఆర్‌ఎస్‌కు దీటైన అభ్యర్థిని బరిలోకి దించాలని భావిస్తోంది. సామాజిక కోణంలో పరిశీలించి అభ్యర్థిని ఎంపిక చేయాలని నిర్ణయించింది. ఇటు బీజేపీ కూడా ఈ నియోజకవర్గం అభ్యర్థి ఎంపిక విషయంలో తర్జన భర్జన పడుతోంది.

**ప్రయత్నాల్లో ఆశావహులు**

మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులు టిక్కెట్ల కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థిత్వాలు దక్కించుకుంటే గెలుపు సాధ్యమవుతుందని భావిస్తున్న ఆయా పార్టీల నేతలు ఇందుకోసం అన్ని ఎఫర్టులు పెడుతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి ప్రధానంగా గజ్వేల్‌కు చెందిన వంటేరు ప్రతాప్‌రెడ్డి, పటాన్‌చెరుకు చెందిన గాలి అనిల్‌కుమార్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. గాలిని జహీరాబాద్ నుంచి బరిలోకి దింపాలని బీఆర్‌ఎస్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, మాజీ కలెక్టర్ వెంకట్‌రాంరెడ్డిల పేర్లు కూడా వినిపించాయి. బీజేపీ నుంచి పటాన్‌చెరుకు చెందిన పారిశ్రామికవేత్త అంజిరెడ్డి, ఆ పార్టీ నాయకులు గురువారెడ్డి, రఘునందన్‌రావు తదితరులు ఆశిస్తున్నారు. అనూహ్యంగా చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ, బీఆర్‌ఎస్‌కు చెందిన రంజిత్‌రెడ్డి పేరు బీజేపీ నుంచి ప్రచారంలోకి వచ్చింది. ఇక కాంగ్రెస్ నుంచి చిట్కుల్ సర్పంచ్ నీలం మధుముదిరాజ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అలాగే మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంత్‌రావు, జగ్గారెడ్డిల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. మొత్తం మీద ప్రత్యేకతను సంతరించుకున్న మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయనున్న అభ్యర్థులు ఎవరనే ఉత్కంఠ రెండు, మూడు రోజుల్లో వీడే అవకాశాలు కనిపిస్తున్నాయి.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్

# విస్తృతంగా స్వీప్

- ఎంపీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగాలి
- కలెక్టర్, అధికారులకు సీఈఓ వికాస్‌రాజ్ ఆదేశం

**మెదక్ కలెక్టరేట్:** త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధికంగా ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లాలో విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి పార్లమెంట్ ఎన్నికలపై కలెక్టర్, జిల్లా అధికారులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ టర్న్ ఔట్ పెరిగేలా విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యా సంస్థల్లో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్బులు ప్రారంభించి ఓటు ప్రాముఖ్యత గురించి వివరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని ప్రముఖులను గుర్తించి వారితో అవగాహన వీడియోలు రూపొందించాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌లపై పూర్తిస్థాయి కంట్రోల్ ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలను నిరంతరం పరిశీలిస్తూ ఎన్నికలకు సంబంధించిన రిపోర్టులను సకాలంలో తప్పులు లేకుండా నమోదు చేసి సమర్పించాలన్నారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా పెండింగ్ దరఖాస్తులను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఓటరు జాబితాలో వచ్చే మార్పులపై ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. మినిట్స్ కాపీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

**క్రీడాకారులకు అభినందన**

రామాయంపేటలో ఈనెల 9,10 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు దిలీప్, అనుజ్ఞ, ప్రణయ్, అనిల్‌తేజ్, సిద్ధార్థ్, హరీష్.. బంగారు, వెండి, రజత పతకాలు సాధించడంపై కలెక్టర్ రాహుల్‌రాజ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వారిని అభినందించారు. ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 20 నుంచి 25 వరకు హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

# మళ్లీ పునరావృతం కానివ్వం

- ప్రోగ్రాం ఆఫీసర్ మెటర్నరీ హెల్త్ డా.విజయనిర్మల
- 'అర్ధరాత్రి ప్రసవ వేదన' ఘటనపై విచారణ

సాక్షి ఎఫెక్ట్



వివరాలు సేకరిస్తున్న వైద్యశాఖ అధికారులు

**వెల్దుర్తి(తూప్రాన్):** మహిళల ప్రసవ వేదన ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని ప్రోగ్రాం ఆఫీసర్ మెటర్నరీ హెల్త్ డా.విజయనిర్మల, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డా.అరుణశ్రీ తెలిపారు. అర్ధరాత్రి ప్రసవ వేదన .. పురిటినొప్పులతో మహిళ ఆస్పత్రి ఆవరణలోనే డెలివరీ అయ్యిందని సాక్షి పత్రిక మంగళవారం ప్రచురించిన కథనానికి స్పందన వచ్చింది. మంగళవారం వారు వెల్దుర్తి మండలకేంద్రంలో ఉన్న ఆస్పత్రిని సందర్శించారు. ఆదివారం రోజు విధుల్లో ఉండాల్సిన స్టాఫ్ నర్స్ డే ఆఫ్‌లో ఉందని, ఆరోజే ఏఎన్‌ఎం జయంతిని రిలీవర్‌గా వేశారన్నారు. సాయంత్రం 6 గంటలకు విధులకు హాజరై అర్ధరాత్రి 12 గంటల వరకు వేచి ఉందన్నారు. ఈ సమయంలో డ్యూటీకి రావాల్సిన ఆఫీస్ సబార్డినేట్ రాలేదన్నారు. అప్పుడే తన భర్తకు ఫోన్ చేసి, అతను వచ్చే లోపు ఆస్పత్రి పక్కనున్న స్నేహితురాలి ఇంటికి వెళ్లిందన్నారు. కొద్ది సేపటికే ప్రసవ వేదనతో గర్భిణి సృజన వచ్చిందని, వెంటనే లేబర్ రూంకు తరలిస్తుండగా ఆవరణలో ఆడ శిశువు పుట్టిందన్నారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి సమయాల్లో ఉండాల్సిన ఇద్దరు మహిళా వర్కర్లకు 60 ఏళ్లు నిండటంతో ప్రభుత్వ ఆదేశానుసారం రిలీవ్ చేశామన్నారు. నూతన సిబ్బందిని ఎంపిక చేసే వరకు గ్రామ పంచాయతీ తరఫున ఇద్దరు సిబ్బందిని రాత్రి పూట సహాయానికి కేటాయించాలని కోరనున్నట్లు తెలిపారు.

# పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా

**మెదక్ కలెక్టరేట్:** జిల్లాలో పోడు భూములు కలిగిన ఉన్న రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవయ్య, మల్లేశంలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద గల ధర్నా చౌక్‌లో పోడు భూముల బాధిత రైతులతో కలిసి వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాటి హక్కుల కోసం ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో వందలాది మంది రైతులు దరఖాస్తు చేసుకుంటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లాలో సుమారు 5 వేల మంది పోడు భూముల్లో కాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. వీరికి గత పాలకులు పట్టా పాస్ బుక్‌లు ఇప్పిస్తామని కాలయాపన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ధరణిలో పెండింగ్ పడి ఉన్న భూ సమస్యలు గ్రామాల్లో గ్రామ సభల ద్వారా పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రతి గ్రామంలో ఇనాం భూముల సమస్య ప్రధానంగా ఉందని తెలిపారు.



కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పోడు భూముల రైతులు

# చదువులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రాధాకిషన్

**డీఈఓ రాధాకిషన్**

**శివ్వంపేట(నర్సాపూర్):** ప్రతి విద్యార్థి చదువులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఈఓ రాధాకిషన్ అన్నారు. కృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గత సంవత్సరం 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మంగళవారం దొంతి ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో చదువుకు ఉన్న ప్రాధాన్యత మరో దానికి లేదన్నారు. ఇష్టంతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల అభినందించారు. కృషి విజ్ఞాన గ్రామీణాభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ మండలంలోని 11 ఉన్నత పాఠశాలల్లో మొదటి, ద్వితీయ స్థానంలో నిలిచిన విజేతలకు బహుమతుల ప్రదానం చేసినట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలోనూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు చేయూత అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చనాయక్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ సింగం శ్రీనివాస్‌రావు, సన్సినోవా ఎండీ తాటి శ్రీనివాస్, ప్రముఖ వైద్యుడు సుబ్రహ్మణ్యం, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

**చండీ పాఠశాల తనిఖీ**

పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. మండల పరిధిలోని చండీ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేసి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఆపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేందర్, ఉపాధ్యాయులు దయానంద్‌రెడ్డి, వామనశర్మ, సంతోష్‌కుమార్, విజేందర్ రెడ్డి, అరుణ తదితరులు ఉన్నారు.

# రైతునేస్తంతో సమస్యలు పరిష్కారం



వీడియో కాన్ఫరెన్స్‌లో గోవిందు, ఇతర అధికారులు

**జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు**

**రామాయంపేట(మెదక్):** రైతు నేస్తం కార్యక్రమాల ద్వారా శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులతో ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించి రైతులను చైతన్య పరుస్తామని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేటలోని రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు నేరుగా రైతులతో మాట్లాడి వారి వ్యవసాయ సంబంధిత సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. వేసవిలో మామిడి పిందె రాలడానికి కారణాలను వివరించి ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను శాస్త్రవేత్త సుచరిత వీడియో కాన్ఫరెన్స్‌లో అవగాహన కల్పించారు. మామిడితోట సాగు విషయమై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. నివారణకు గాను నీటి యాజమాన్య పద్ధతుల గురించి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, శాఖ ఉన్నతాధికారులు పంటల సాగు విషయమై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామాయంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు వసంత సుగుణ, మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, ఇతర మండలాల అధికారలు, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ వద్దేవద్దు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పెట్టాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి
- ఇచ్చిన హామీలను అమలు చేయండి
- కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా
- అదనపు కలెక్టర్‌కు వినతి

**మెదక్ కలెక్టరేట్:** అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ఎదుట జిల్లాలోని అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ రమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రాలకు ఒక్క పూట బడితోపాటు మే నెలంతా టీచర్స్, హెల్పర్స్‌కు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనిచేయని సెల్ ఫోన్లు తిరిగి అప్పగిస్తున్నామన్నారు. 24 రోజుల సమ్మె హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హెల్పర్స్‌కు పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని సీఎం రేవంత్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇది తమను అవమానించినట్లు అవుతుందన్నారు. ఈ విధానానికి సీఐటీయూ వ్యతిరేకమన్నారు. 48 సంవత్సరాలుగా పనిచేస్తున్న టీచర్స్, హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన బెట్టారన్నారు. ఎన్నికల సమయంలో సమస్యలు పరిష్కారం చేస్తామని ఇచ్చిన హామీని సర్కారు వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అన్నపూర్ణ, కార్యదర్శి నర్సమ్మ, నాయకులు లలిత, మంజుల, సంతోష, సావిత్రి, ఇందిర, మంగ, మమత, భారతి, జబీన, శారద, శ్రీలత, శివలక్ష్మి నాగమణి, శ్యామల, సంగీత, సునీత, వనజ, శిరీష, శోభ, శ్రీదేవి, కవిత, వాణి, రమాదేవి, స్రవంతి రజిత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లగూడెంలో బోనాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

# భక్తితో మొక్కి.. బోనమెత్తి..

**టేక్మాల్(మెదక్):** టేక్మాల్ మండలం గొల్లగూడెంలో ముత్యాల పోచమ్మ, మత్తడి పోచమ్మ దేవాలయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అర్చనలు.. ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బోనాల ఊరేగింపు నడుమ శివసత్తువుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానాన్ని గావించారు.

## క్లుప్తంగా

### బాధిత మహిళలకు అండగా 'భరోసా'

సిద్దిపేట సీపీ అనురాధ



కేక్‌ కట్‌ చేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్‌: బాధిత మహిళలు, బాలికలకు అండగా సిద్దిపేట భరోసా సెంటర్‌ సేవలు అందిస్తుందని పోలీసు కమిషనర్‌ అనురాధ అన్నారు. జిల్లాలో భరోసా సెంటర్‌ ప్రారంభించి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆమె మంగళవారం కేక్‌ కట్‌ చేసి సిబ్బందిని అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. 100 లేదా 08457–293098కు ఫోన్‌చేసి సహాయం పొందవచ్చన్నారు. భరోసా సెంటర్‌ ద్వారా ఇప్పటి వరకు 223మంది బాధితులకు సేవలందించినట్లు చెప్పారు. ఏసీపీ మధు, మహిళబూ పోలీసు స్టేషన్‌ సీఐ దుర్గ, రూరల్‌ సీఐ శ్రీను, కానిస్టేబుల్‌ అనూష, భరోసా సెంటర్‌ సిబ్బంది స్వాతి, వినోద, సౌమ్య, హరిత, రేణుక, భవాని, తదితరులు పాల్గొన్నారు.

### మేనమామపై కత్తితో దాడి

దుబ్బాకరూరల్‌: మేనమామపై అల్లుడు కత్తితో దాడి చేసిన ఘటన మండలంలోని బల్వంతాపూర్‌ గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ గంగరాజ్‌ తెలిపిన వివరాల ప్రకారం..అబ్దుల్‌ రజాక్‌కు కొంత కాలంగా మేన మామలతో ఘర్షణ జరుగుతోంది. ఈ క్రమంలో సోమవారం మూడో మేనమామ షాదుల్లపై కత్తితో దాడికి దిగగా అతడికి అడ్డు వచ్చిన పెద్దమామ బాబుమియాపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. షాదుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు రజాక్‌పై హత్యాయత్నం కింద కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నర్సాపూర్‌ చౌరస్తా, అంబేడ్కర్‌ చౌరస్తా, బీజేఆర్‌ చౌరస్తాతో పాటు పలు చోట్ల తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 11మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో మంగళవారం హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి శ్రావణి వారికి రూ.4వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

### కృత్రిమ ఇసుక తయారీ కేంద్రంపై టాస్క్‌ ఫోర్స్‌ దాడులు

సంగారెడ్డి: కృత్రిమంగా ఇసుకను తయారు చేస్తున్న స్థావరంపై టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి కథనం ప్రకారం.. ఇస్మాయిల్‌ ఖాన్‌ పేట శివారులో గల నక్కవాగులో వెండికోల్‌ వీరేశం ఇటాచితో మట్టిని తవ్వి దానిని కృత్రిమంగా ఇసుకలా మారుస్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులు మంగళవారం దాడి చేసి ఇసుకతోపాటు ఒక ఇటాచి, రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. నిందితులను రూరల్‌ పోలీసు స్టేషన్‌ తరలించామని టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు తెలిపారు.

### వలసకూలీ హత్య



తిరుపతి మృతదేహం

సిద్దిపేటరూరల్‌: గుర్తు తెలియని దుండగులు వలస కూలీని హత్య చేసిన ఘటన చిన్నగుండవెల్లి శివారు ఎల్లంకి ఇంజనీరింగ్‌ కళాశాల వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ అపూర్వరెడ్డి కథనం ప్రకారం.. ఎల్లంకి ఇంజనీరింగ్‌ కళాశాల వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికులను విచారించారు. ఆంధ్రా నుంచి వచ్చి కూలీ తిరుపతిగా గుర్తించారు. మృతుడి తల, దేహంపై గాయాలు ఉన్నాయని, గుర్తు తెలియని వ్యక్తులు చంపి ఉంటారని ఎస్‌ఐ తెలిపారు.

### తలకు గాయమై..

పాపన్నపేట(మెదక్‌): మల్లంపేట చెందిన ఎరుకల పోచయ్య(46) గత 8వ తేదీ రాత్రి ఇంటి నుంచి టాయిలెట్‌కి వెళ్లే సమయంలో బండ రాళ్లు పడగా తలకు గాయమైంది. దీంతో చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



# కాలేజీ.. నిధులపై చొరవేదీ?

సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు ఉన్న సమయంలో భూమి కేటాయించలేదు. భూమి కేటాయించే సరికి నిధులు రద్దు కావడంతో మళ్లీ నిధుల మంజూరు కోసం నర్సాపూర్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కాలేజీ స్టాఫ్‌, విద్యార్థులు ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది.





- భూమి కేటాయించేసరికి నిధులు వెనక్కి
- భవనం సరిపడక 2కోర్సులు తొలగింపు
- కాలేజీని ఎత్తివేసేందుకు కుట్రలు?
- అద్దె భవనంలో అవస్థలు

నర్సాపూర్‌: స్థానిక ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కాలేజీ 2013లోనే మంజూరైనా 2015లో తరగతులు ప్రారంభించారు. ఎంబీఏ, ఎమ్మెస్సీ ఆర్గానిక్‌ కెమెస్ట్రీ, ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్‌, ఎమ్మెస్సీ ఇనార్గానిక్‌ కెమిస్ట్రీ, ఎంసీజే కోర్సులతో కాలేజీని అద్దె భవనంలో ప్రారంభించారు. ఆ భవనం సరిపడడం లేదన్న సాకుతో 2018లో ఎమ్మెస్సీ ఇనార్గానిక్‌ కెమిస్ట్రీ, ఎంసీజే కోర్సులను రద్దుచేసి మూడు కోర్సులతో కాలేజీ నిర్వహిస్తున్నారు. కాలేజీ మంజూరు సమయంలో అప్పటి ప్రభుత్వం కాలేజీకి సొంత తరగతి భవనాలు, ల్యాబొరేటరీలు, పరిపాలన విభాగం భవనం, బాలురు, బాలికల వసతి గృహాలు, స్టాఫ్‌ క్వార్టర్లకు సొంత భవనాలు నిర్మించేందుకు సుమారు రూ.20కోట్లు మంజూరు చేసింది. అయితే వాటిని నిర్మించేందుకు అవసరమైన పదెకరాల భూమిని కేటాయించక పోవడం వల్ల నిర్మాణ పనులు ప్రారంభించలేదు. దీంతో కొంత కాలానికి నిధులు రద్దుచేశారు. 2022 డిసెంబరు 12న కాలేజీకి పదెకరాల భూమి కేటాయిస్తూ అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అప్పటి కాలేజీ డైరెక్టర్‌ జయప్రకాశ్‌రావుకు అప్పగించారు. పీజీ కాలేజీని మినీ యూనివర్సిటీగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

**నిధుల కోసం ప్రయత్నాలు నిల్‌..**

భవనాలు నిర్మించేందుకు భూమి ఉన్నా అవసరమైన నిధుల మంజూరు కోసం కాలేజీ, ఉస్మానియా యూనివర్సిటీ తరఫున ప్రయత్నాలు చేయడం లేదని విమర్శలు ఉన్నాయి. ఓయూ తరఫున ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపలేదని, ప్రతిపాదనలు పంపితే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని పలువురు చెపుతున్నారు.

**కాలేజీ ఎత్తివేసేందుకు..**

పీజీ కాలేజీని ఎత్తివేసేందుకు మూడేళ్ల నుంచే కుట్రలు ప్రారంభమయ్యాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అద్దె భవనం సరిపడడం లేదనే సాకుతో రెండు కోర్సులు రద్దు చేయడం కూడా అందులో భాగమేనని విద్యార్థులు విమర్శించారు. కాలేజీని ఎప్పుడు ఎత్తి వేస్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని, అందుకు కొందరు అధికారులు కుట్రలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. నిధులు మంజూరుచేసి సొంత భవనాలు నిర్మించాలని, రద్దు చేసిన రెండు కోర్సులను తిరిగి ప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు.





ఓయూ కాలేజీ

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా**

కాలేజీ నిర్వహణకు అద్దె భవనం సరిపడడం లేదనే విషయాన్ని ఓయూ పీజీ కాలేజీల డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ రవికుమార్‌ దృష్టికి తీసుకుపోయానని స్థానిక పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌ మహేశ్వరరెడ్డి చెప్పారు. అలాగే సొంత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేసినట్లు ఆయన చెప్పారు. అయితే నిధుల కోసం ఓయూ అధికారులు ప్రభుత్వానికి ప్రతాపాదనలు పంపాల్సి ఉంటుందని, అది తన పరిధిలో ఉండదని ఆయన తెలిపారు. - ప్రిన్సిపాల్‌ మహేశ్వరరెడ్డి



**నిధుల కోసం కృషి చేస్తా..**

పీజీ కాలేజీకి నిధులు మంజూరు చేయించి సొంత భవనాలు నిర్మించేందుకు కృషిచేస్తా. గతంలో కాలేజీకి భూమి కేటాయించాలని జిల్లా కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులపై ఒత్తిడి చేశాను. కాలేజీకి సొంత భవనాలు నిర్మించేందుకు, రద్దయిన కోర్సులను పునః ప్రారంభించే విధంగా కృషి చేస్తాను. కాలేజీని ఎత్తివేయకుండా చర్యలు తీసుకుంటాను. - ఎమ్మెల్యే సునీతారెడ్డి

# హాజరు లేకున్నా.. డబ్బులు డ్రా

మనూరు(నారాయణఖేడ్‌): గతేడాది నిర్వహించిన ఉపాధి పనుల్లో సిబ్బంది అవినీతి వెల్లడైంది. మంగళవారం నాగల్‌గిద్ద మండల కార్యాలయంలో జిల్లా అదనపు పీడీ బాల్‌రాజ్‌, విజిలెన్స్‌ అధికారి నాగేశ్వర్‌ రావు, ప్లాంటేషన్‌ మేనేజర్‌ మణికుమార్‌ తనిఖీ నిర్వహించారు. పలు అవకతవకలు, సిబ్బంది నిర్లక్ష్యం వంటి అంశాలు వెలుగుచూశాయి. కూలీల హాజరు లేకున్నా ఉన్నట్లు సంతకాలు చేసి డబ్బులు డ్రా చేయడం, కొలతలు తుక్కువగా ఉన్నా ఎక్కుగా చూపడం, పాత పనులనే కొత్తవాటిగా చూపించిన జాబ్‌కార్డులు, సక్రమంగాలేని చెల్లింపులు వంటివి అధికారులు గుర్తించారు. సంబంధిత అధికారులు, ఉపాధిహామీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు టీఏలకు నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ మురళీకృష్ణ, ఎంపీడీఓ రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

### ఇష్టం లేని పెళ్లి చేశారని..

- నవవధువు బలవన్మరణం
- కాళ్ల పారాణి ఆరకముందే..

పాపన్నపేట, టేక్మాల్‌ (మెదక్‌): ఇష్టంలేని పెళ్లిని జీర్ణించుకోలేని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని బోడగట్టు గ్రామంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. మెదక్‌ రూరల్‌ సీఐ కేశవులు, పాపన్నపేట ఎస్‌ఐ నరేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్‌ మండలం బోడగట్టు గ్రామానికి చెందిన మంజుల, సంగమేశ్వర్‌ దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. పెద్ద కూతురు నాగమణి అలియాస్‌ వైష్ణవి పదో తరగతి చదివి మానేసింది. అయితే ఆమె తల్లిదండ్రులు అదే గ్రామానికి చెందిన వారి మేనల్లుడు ఎర్ర శ్రీకాంత్‌కు ఇచ్చి ఎనిమిది రోజుల క్రితం వివాహం చేశారు. మంగళవారం అత్తారింటికి వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో ఆమె బాత్రూంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. డీఎస్పీ, డాక్టర్‌ రాజేశ్‌, టేక్మాల్‌ తహసీల్దార్‌ కృష్ణ, ఆర్‌ఐ సాయి శ్రీకాంత్‌ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

# మాయమాటలతో సైబర్‌ మోసాలు

- రూ.3,71,420 పోగొట్టుకున్న బాధితులు
- వివరాలు వెల్లడించిన సీపీ



సిద్దిపేటకమాన్‌: మాయ మాటలతో మోసం చేస్తూ సైబర్‌ కేటుగాళ్లు ఆన్‌లైన్‌ మోసాలకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు, బ్యాంక్‌ కేవైసీ అప్‌డేట్‌, ఆన్‌లైన్‌ యాప్‌ల పేరిట వచ్చిన లింకులు ఓపెన్‌ చేసిన పలువురు బాధితులు రూ.3,71,420 డబ్బులు పంపి మోసపోయారు. కమిషనరేట్‌ పరిధిలో చోటు చేసుకున్న పలు సైబర్‌ మోసాల వివరాల గురించి సీపీ మంగళవారం వెల్లడించారు. హుస్నాబాద్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఓ ఆన్‌లైన్‌ యాప్‌ను పంపించాడు. అందులో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మి న ఆ బాధితుడు రూ.1,18,300 పంపించాడు. తర్వాత ఆ లింకు ఓపెన్‌ చేయగా బ్లాక్‌ చేసి ఉండడంతో జాతీయ హెల్ప్‌లైన్‌ నెంబర్‌ 1930కు ఫిర్యాదు చేశాడు. బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న రూ.91,400 పోలీసులు ఫ్రీజ్‌ చేశారు. ఇదే తరహాలో మరో వ్యక్తి ఆన్‌లైన్‌లో రూ.69వేలు పంపి మోసపోయాడు. రాజగోపాల్‌పేట పోలీసు స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తికి ధనిలోన్‌ యాప్‌లో లోన్‌ మంజూరైందని డబ్బులు ఖాతాలో జమ కావాలంటే ప్రాసెసింగ్‌ చార్జీలు చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తి తెలిపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు ఆన్‌లైన్‌లో రూ.19,097 పంపించాడు. కమిషనరేట్‌ పరిధిలో ఓ వ్యక్తికి బ్యాంక్‌ అకౌంట్‌ కేవైసీ అప్‌డేట్‌ చేయాలని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌ చేసి ఓ లింకును పంపాడు. బాధితుడు ఆ లింకును ఓపెన్‌ చేసి తన వివరాలు నమోదు చేసి, తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చేయగానే తన ఖాతా నుంచి రూ.1,65,023 డెబిట్‌ అయినట్లు మెసేజ్‌ వచ్చింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు దర్యాప్తు చేస్తున్నామని సీపీ తెలిపారు.



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌

# రూ.1.20 కోట్లు.. తగ్గేదేలే..

- ఒకరికి మించి మరొకరు పోటాపోటీ
- రికార్డు సృష్టించిన వారపుసంత వేలం

హుస్నాబాద్‌: ప్రతి శుక్రవారం జరిగే వారపుసంత బహిరంగ వేలం రసవత్తరంగా సాగింది. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ ఆకుల రజిత అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ వేలం పాటలో వివిధ జిల్లాలకు చెందిన 23మంది గుత్తేదారులు పాల్గొన్నారు. గత ఏడాది రూ.80లక్షలతో అంగడిని దక్కించుకున్నారు. ఇప్పుడు అదనంగా 10శాతం కలిపి పాటను ప్రారంభించారు. గతంలో ఎన్ని రసీదు బుక్కులు ముద్రించి ఇచ్చారో, లావాదేవీలను స్పష్టం చేయాలని కొందరు గుత్తేదారులు కోరారు. దుకాణాల రేట్లను పెంచాలని, వారపుసంతకు ప్రత్యేకంగా స్థలం కేటాయించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌ చేశారు. కొంత సేపు వేలం పాటకు అంతరాయం కలిగించారు. నాలుగు గంటల పాటు గుత్తేదారులు తగ్గేదేలే అన్నట్లుగా పోటాపోటీగా వేలం పాటను పెంచుతూ వెళ్లారు. ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా గంగాధర్‌కు చెందిన రుద్రాక్ష శ్రీనివాస్‌ రూ.1.20,26,000కు బహిరంగ వేలంలో హుస్నాబాద్‌ అంగడిని దక్కించుకున్నారు. అంగడి చరిత్రలో అత్యధికంగా కోటికి పైగానే పాటపాడి రికార్డు సృష్టించారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం రూ.40.26 లక్షలు అదనంగా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరినట్లే. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్‌పర్సన్‌ అయిలేని అనిత, కమిషనర్‌ మల్లికార్జున్‌, కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, హరీశ్‌, వల్లపు రాజు, జనగాయ రత్న, కో ఆప్షన్‌ సభ్యుడు అయిలేని శంకర్‌ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# నాగమ్మా.. దోషాలు తొలగించమ్మా..

## కొనసాగుతున్న ప్రతిష్ఠాపన మహోత్సవాలు



విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

జహీరాబాద్‌: పట్టణంలో నూతనంగా నిర్మించిన నాగదేవత ఆలయంలో 1,008 సామూహిక నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు రెండో రోజైన మంగళవారం కూడా ఘనంగా కొనసాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో హోమం, నాగప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. 350మందికి పైగా దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులు 36 ప్రదక్షిణలు చేశారు. బుధవారం కూడా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. కార్యక్రమాల్లో కాశీకి చెందిన జగదీశ్వరస్వామి, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్‌ చైర్మన్‌ ఎం.శివకుమార్‌, మున్సిపల్‌ మాజీ చైర్మన్లు మంకాల్‌ సుభాస్‌, అల్లాడి నర్సింహులు, బర్దీపూర్‌ ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్‌, సిద్ధేశ్వరస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

# చీటీ డబ్బులు కట్టలేక ఆత్మహత్య



కళమ్మ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్‌): చిట్టీ డబ్బులు కట్టలేక మనస్థాపం చెందిన ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్సింగి మండలం బీమ్‌రావుపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అహ్మద్‌ మోహినొద్దీన్‌ కథనం మేరకు మండలంలోని భీమ్‌రావుపల్లి గ్రామానికి చెందిన ఇప్పకింది కళమ్మ(40) సోమవారం రాత్రి ఇంటి ముందు రేకులషెడ్డుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చిట్టీకి డబ్బులు కట్టాలని భర్తను అడుగగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన కళమ్మ అందరు పడుకున్నాక ఆత్మహత్యకు పాల్పడింది. భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

**అప్పులబాధతో రైతు..**



స్వామి(ఫైల్‌)

చేగుంట(తూప్రాన్‌): అప్పులబాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన పులిమామిడి కిష్టాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్మస్వామి(30) ఎకరా పొలంలో వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయం కోసం అప్పులు చేశాడు. పొలానికి నీరు అందక పోవడంతో వరిపంట ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో మనస్తాపం చెందిన స్వామి పొలంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. స్థానిక రైతులు పోలీసులకు సమాచారం అందించగా గ్రామానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

**అల్సర్‌ వ్యాధితో..**



బూదయ్య(ఫైల్‌)

నిజాంపేట(మెదక్‌): అల్సర్‌ వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరి వేసకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంపేట మండలంలోని చల్మెడ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బ్యాగరి బూదయ్య(43) ఆరు నెలల నుంచి అల్సర్‌ వ్యాధితో బాధదపడుతున్నాడు. సిద్దిపేటలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య శోభ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఈ మేరకు మృతుని తల్లి బ్యాగరి రామవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# వేసవి దుక్కులు.. రైతులకు మేలు..

- వాలుకు అడ్డంగా దున్నాలి
- లోతు దుక్కులతో భూ సారం అధికం
- ముందు సేంద్రియ ఎరువులు చల్లాలి
- చీడపీడల నివారణ సాధ్యం
- సహాయ వ్యవసాయ సంచాలకుడు రామ్‌ప్రసాద్‌



ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతున్న రైతు(ఫైల్‌)

టేక్మాల్‌(మెదక్‌): వేసవి కాలం ప్రారంభం అయింది. ఈ సమయంలో ఖాళీ పొలాలను దున్నుకుంటే రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. ఖరీఫ్‌లో వేసిన పంటలు చేతికి వచ్చాయి. పంట పొలాల్లో ఉన్న కట్టెలు, చెత్త చెదారాన్ని తొలగించుకున్నారు. అయితే నేలను దున్నకుండా వదిలేయకూడదు. వేసవి దుక్కులతో చాలా ఉపయోగాలున్నాయి. ఆ విషయాలపై పెద్దశంకరంపేట సహాయ వ్యవసాయ సంచాలకుడు రాం ప్రసాద్‌ ముఖ్యవిషయాలు మనతో పంచుకున్నారు. ఆయన సలహాలు, సూచనలు మీకోసం.

**దుక్కులు చేయకుండా వదిలేస్తే**

పంటలు చేతికి వచ్చాక మళ్లీ సాగుచేసే వరకు భూమిని ఖాళీగా ఉంచడం మంచిది కాదు. భూమిని ఖాళీగా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహిస్తాయి. తద్వారా భూమిలో సత్తువ లేకుండా పోతుంది.

**లోతు దుక్కులతో మరింత మేలు**

భూమిని లోతుగా దున్నడంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. తొలకరి వర్షాలకు ముందే భూమిని వాలుకు అడ్డంగా లోతుగా దున్నాలి. ఇలా చేస్తే భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తేలి భూమి సారం పెరుగుతుంది. వానలు పడినప్పుడూ నీరు బాగా ఇంకిపోయి తేమశాతం అధికమవుతుంది. అలాగే కలుపును బాగా నివారించవచ్చు. అంతేకాకుండా భూమి కోతకు గురికాదు.

**పశువుల మందల ఒడిగింపు తప్పనిసరి**

వేసవి దుక్కి దున్నేముందు గొర్రెలు, మేకలను ఖాళీ పొలాల్లో ఒడిగించాలి. అవి విసర్జించే మల, మూత్రాలు భూమిలోకి చేరి భూ సారం పెరుగుతుంది. దీంతో పంటల్లో సూక్ష్మపోషకాల లోపాలు నివారించవచ్చు. అవకాశం ఉంటే కంపోస్టు లేదా చెరువు మట్టి పొలంలో చల్లితే ఖరీఫ్‌ పంటలకు మరింత మేలు కలుగుతుంది.

**కలుపు యాజమాన్యం..**

సాధారణంగా పంటలేని సమయంలో పొలంలో కలుపు మొక్కలు పెరగడం సహజం. ఈ కలుపు మొక్కలు నేలలోని నీరు, పోషకాలను ప్రత్యక్షంగా గ్రహించి పంట దిగుబడి తగ్గిస్తాయి. అనేక రకాల పురుగులకు, శిలీంద్రాలకు కలుపు మొక్కలు ప్రత్యామ్నాయంగా పని చేస్తాయి. దుక్కుల వల్ల ఆ కలుపు మొక్కలు, వాటి విత్తనాలు నేల పైపొరల్లోకి చేరి ఎండకు ఎండి నశిస్తాయి.

**దుక్కులతో తెగుళ్ల నివారణ**

అనేక రకాల పురుగులు పంటకోత తర్వాత వాటి నిద్రావస్థ దశలను నేలలో, చెత్తాచెదారంలో, కొయ్యకాడల్లో గడుపుతాయి. తెగుళ్లను కలిగించే శిలీంద్రాలు భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. వాటి శిలీంద్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయి. ఈ దశలో లోతుగా దున్నితే నిద్రావస్థ దశలో భూమిలో ఉన్న చీడపురుగుల కోశాలు, గుడ్లు, లార్వాలు ప్యూపాలు బయటపడి అధిక ఉష్ణోగ్రతకు గురై చనిపోతాయి. ఏమన్నా మిగిలిపోయినా పక్షులు, కొంగలు, కాకులు తిని నాశనం చేస్తాయి. దుక్కులతో లోపలి పొరల్లో ఉన్న శిలీంద్ర బీజాలు మట్టితోపాటూ నేలపైకి వస్తాయి. ఆ సమయంలో అధిక ఉష్ణోగ్రతకు గురై వ్యాధి కలగజేసే శక్తిని కోల్పోతాయి.

### లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



యాదగిరి(ఫైల్‌)

రాయపోలు(దుబ్బాక): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన రాయపోలు మండలం అంకిరెడ్డిపల్లి వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ రఘుపతి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోలుకు చెందిన కొంగరి యాదగిరి(55) పాత ఇనుప సామగ్రి వ్యాపారం చేస్తుంటాడు. రోజువారీ పనిలో భాగంగా మంగళవారం ఉదయం 6గంటలకు అంకిరెడ్డిపల్లి వైపు పాత ఇనుప సామాగ్రి సేకరణకు వెళ్లాడు. 8గంటల ప్రాంతంలో గజ్వేల్‌ వైపు నుంచి చేగుంట వైపు వెళ్తున్న ఓ లారీ యాదగిరి వెళ్తున్న టీవీఎస్‌ వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో యాదగిరి అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ ద్విచక్రవాహనాన్ని సుమారు 2కిలో మీటర్ల ఈడ్చుకు పోయింది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గజ్వేల్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రఘుపతి తెలిపారు.